విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - లక్కవరపుకోట: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించినట్లు మండల శాఖ గ్రంథాలయ అధికారిణి బి.మేరీ నిర్మల తెలిపారు. సోమవారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. గత నెల 28 నుంచి ఈనెల 6 వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలో భాగంగా పుస్తకాలు చదవడం, రాయడం, పద్యాలు చెప్పడం, చెస్, క్యారం బోర్డు ఆడటం వంటి కార్యక్రమాలు ఏపీ మోడల్ స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ శ్రావణి ఆధ్వర్యంలో నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాతవలస టోల్ గేటు వద్ద ఘోర ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ సజీవ దహనం
- జ్యూట్ బ్యాగుల లోడుతో వెళ్తున్న లారీ దగ్ధం

విశాలాంధ్ర - డెంకాడ: డెంకాడ మండలం నాతవలస టోల్ గేట్ వద్ద సోమవారం ఓ లారీకి సంభవించిన అగ్ని ప్రమాదంలో సదరు లారీ డ్రైవర్ సజీవ దహనం అయ్యారు. ఆ ప్రమాదంలో లారీ కూడా దగ్ధమైంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు జ్యూట్ బ్యాగుల లోడుతో వెళ్తున్న లారీ టోల్ గేటు సమీపంలో ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టింది. దీంతో సదరు లారీలో

ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. లారీ క్యాబిన్లో ఇరుక్కున్న డ్రైవర్ వసుదేవ్ సిక్దర్ (43) సజీవ దహనం అయ్యారు. డ్రైవర్‌ను కాపాడటానికి స్థానికులు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. ఈ ప్రమాదంలో లారీ కూడా పూర్తిగా దగ్ధమైంది. మంటలను ఆర్పడానికి అగ్నిమాపక యంత్రాంగం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డెంకాడ ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు.

నిరుపయోగంగా శ్రీనాధుల గంగన్న శెట్టి సత్రం స్థలం

దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్య ధోరణి

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట, విజయనగరం రోడ్డు మార్గంలో గల శ్రీనాధుల గంగన్న శెట్టి సత్రం ఎంతోమంది అన్నార్తుల పొట్ట నింపిన చారిత్రకమైన ఈ ధర్మస్థలం దేవాలయ ధర్మాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్య ధోరణి నిర్లక్ష్యం వల్ల పాడుబడుతోంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ సత్రం ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోకుండా రెండు వీధులను కలిపే సాధారణ రోడ్డుగా మారిపోయింది. సుమారు 8 సెంట్ల విస్తీర్ణంతో ఉన్న ఈ భూమి ఒకప్పుడు ఆర్యవైశ్య సమాజం నిర్వహించే కాలంలో ఎంతోమంది పేదలకు అన్నదానం చేసే గొప్ప సంస్థగా ప్రసిద్ధి చెందింది. కానీ ప్రస్తుతం ఇక్కడ ప్రాథమిక సౌకర్యాలు కూడా లేక ప్రహరీ కూడా నిర్మించబడకుండా సత్రం నిరుపయోగంగా మారిపోయింది. ఈ సత్రాన్ని తిరిగి ఆర్యవైశ్య సమాజానికి అప్పగించాలని వారు అనేకసార్లు అర్జీలు సమర్పించారు. సత్రాన్ని స్వచ్ఛందంగా నిర్వహిస్తామని వారు హామీ ఇచ్చినప్పటికీ, దేవాదాయ శాఖ అధికారులు ఏ మాత్రం స్పందించలేదు. గతంలో ఈ స్థలంపై వాణిజ్య ఏర్పాట్ల కోసం టెండర్లు పిలిచినప్పటికీ అవి కూడా సరిగ్గా అమలు చేయబడలేదు. ఇంతకీ మరో ఆశ్చర్యకరమైన విషయం

ఏమిటంటే ఈ సత్రం భూమి ఇప్పుడు ప్రధాన రోడ్డు నుండి పక్కన ఉన్న ఇళ్లకు ప్రవేశ మార్గంగా మారిపోయింది. ఇది భూమి యొక్క ముఖ్యమైన భాగాన్ని అక్రమంగా ఆక్రమించడానికి దారితీస్తోందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. శ్రీనాధుల గంగన్న శెట్టి స్థల పునరుద్ధరణకు స్థానికులు, సామాజిక సంస్థలు చొరవ చూపాలని, ప్రహరీ నిర్మించాలని, వాణిజ్య ఏర్పాట్ల ద్వారా దానిని మళ్లీ ఉపయోగకరంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు చొరవ చూపి ఈ స్థలం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చారిత్రక ధార్మిక మహత్యం కలిగిన ఈ సత్రం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతోంది. సరైన పరిరక్షణ అభివృద్ధి చర్యలు తీసుకోకపోతే శాశ్వతంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

తాగునీటి బోరుకు శంకుస్థాపన

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి సచివాలయం-3 పరిధిలో హడ్కో కాలనీలో ఉన్న కమ్యూనిటీ హాల్‌కు మంజూరు చేసిన తాగునీటి బోరుకు ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ శంకుస్థాపన చేశారు. ఈ బోరు నిర్మాణానికి ఎంపీపీ రెండు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. దీంతో బోరు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సుదీర్ఘకాలంగా, అపరిష్కృతంగా ఉన్న ఒక్కొక్క సమస్యను

పరిష్కరించుకుంటూ వస్తున్నామని, ఇందులో భాగంగా ప్రజల దాహార్తి తీర్చేందుకు బోరు నిర్మాణాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి శ్రీనివాస్, ఎంపీపీ ప్రతినిధి, జిల్లా వైసీపీ కార్యదర్శి ఇప్పిలి అనంతం, జెడ్పీటీసీ ప్రతినిధి, జిల్లా వైసీపీ ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, చీపురుపల్లి మండల వైసీపీ అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు, జిల్లా వైసీపీ యువజన ఉపాధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ, పట్టణ వైసీపీ అధ్యక్షులు వైస్ ఎంపీపీ ప్రతినిధి పతివాడ రాజారావు, ఎంపీటీసీ ప్రతినిధులు గెరిడి రామదాసు, వార్డ్ మెంబర్ సూరు దుర్గారావు, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, సర్వసిద్ధి భాస్కర్, శంకర్, నియోజకవర్గ సోషల్ మీడియా కో - కన్వీనర్ ప్రభాత్ కుమార్, నాగచైతన్య పాల్గొన్నారు

త్వరితగతిన పరిశ్రమలకు అనుమతులు

విశ్వకర్మ యోజన ద్వారా చేతివృత్తులకు ప్రోత్సాహం
జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం: పరిశ్రమల స్థాపన కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించి, నిర్ణీత కాలవ్యవధిలోగా అనుమతులను మంజూరు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు,ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సేతు మాధవన్ మాట్లాడుతూ సింగిల్ విండో ద్వారా గడువు లోపల అనుమతులను మంజూరు చేసి పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. గత మూడు నెలలో పరిశ్రమల స్థాపనకు 149 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఇప్పటివరకు 138 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. వీలైనంత వేగంగా మిగిలిన వాటిని అనుమతించాలని చెప్పారు. అలాగే వీలైనంత వేగంగా రుణాలను మంజూరు చేయాలని బ్యాంకులకు సూచించారు. చేతివృత్తిదారులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పిఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేస్తోందని, వీలైనంత వేగంగా రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బొబ్బిలి వీణల తయారీ లాంటి అరుదైన కళలకు ప్రోత్సాహం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. పిఎం విశ్వకర్మ యోజనకు సుమారు 86,386 దరఖాస్తులు అందగా, మూడు దశల్లో వీటిని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఇప్పటివరకు కేవలం 1,080 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేయడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఈ సర్వే పునఃసమీక్షించాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకోసం స్థలం దాదాపు 15 ఏళ్ల క్రితం స్థలం తీసుకొని, పరిశ్రమను స్థాపించకుండా మళ్లీ గడువు కోరడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని, పరిశ్రమ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జీఎం శ్రీధర్, సహాయ సంచాలకులు బి.రామకృష్ణ, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీ మోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పనిభారం తగ్గించాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రంగరాజు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: విజయనగరం నగరపాలక సంస్థలో పని చేస్తున్న పర్మినెంటు పారిశుధ్య కార్మికులకు నాలుగు సంవత్సరాల సరెండరు లీవు సొమ్మును తక్షణమే కార్మికుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రంగరాజు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ పండగ శెలవు దినాలు అమలు చేయాలన్నారు. నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, పర్మినెంటు కార్మికులు పారిశుధ్య కార్మికులుగా జీతం పొందే ప్రతీ ఒక్కరు కూడా పారిశుధ్య కార్మికుడుగానే పని చేస్తూ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పని భారం తగ్గించాలని, ప్రమోషన్లు కల్పించాలని, సకాలంలో హెల్త్ కార్డ్స్ అందజేయాలన్నారు. చనిపోయిన /రిటైరు అయిన / అవుట్సోర్సింగ్ పారి శుధ్య కార్మికుని స్థానంలో వారి కుంటుంబాలలో ఒకరికి భర్తీచేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని, రిటైర్ అవుట్సోర్సింగ్ పారిశుధ్య కార్మి కులకు రూ.75,000/- రూపాయిలు గ్రాడ్యూటీ మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రేరణ ఉత్సాహాన్ని నింపేందుకే విమాన ప్రయాణం

తెలుగు ఉపాధ్యాయుడు మరడాన సత్యారావు

విశాలాంధ్ర - మెరకముడిదాం: విద్యార్థుల్లో ప్రేరణ ఉత్సాహాన్ని నింపేందుకే తన సొంత ఖర్చులతో విద్యార్థులతో విమాన ప్రయాణం చేయించినట్టు గోపన్నవలస ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మరడాన సత్యారావు అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు విమాన ప్రయాణం చేయిస్తానని మాట ఇవ్వడంతో ఆ మాటను నిలబెట్టుకున్నారు. గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సంగరెడ్డి వివేక్ 493 మార్కులు సాధించి మండలంలోని ప్రథమ స్థానంగా నిలవడమే కాకుండా ఏకంగా జిల్లాలోనే ప్రథమ స్థానం కైవసం చేసుకుని అందర్నీ ఆశ్చర్య చకితుల్ని

చేశాడు. అదేవిధంగా బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలో గ్రామానికి చెందిన తాడేల రేవంత్ 491 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానంలో నిలవడమే కాకుండా, జిల్లాలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. తెలుగు మాస్టారు ప్రేరణతో చదివిన ఈ విద్యార్థులు పదిలో అత్యధిక మార్కులు సాధించారు. విద్యార్థులకు విమాన ప్రయాణ సౌకర్యం కల్పించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడ్ని అభినందించారు. అలాగే సత్యారావు మాస్టారు తమ స్వగ్రామంలో డీఎస్సీ ఉచిత కోచింగ్, ఉచిత మెటీరియల్ సరఫరా చేసి నిరుద్యోగ ఉపాధ్యాయులకు చేయూత అందించారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి

విశాలాంధ్ర - విజయనగరం: అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించబోమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రణాళిక సిబ్బంది ఎన్.సి.ఎస్ రోడ్‌లో ఉన్న నిర్మాణాన్ని తొలగించారు. గతంలో

అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా దుకాణ సముదాయాన్ని నిర్మించడంపై వచ్చిన ఫిర్యాదులు నేపథ్యంలో నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం అధికారులు నిర్మాణాన్ని తొలగించాలని నోటీసులు జారీ చేయగా సదరు ఆక్రమణదారులు కోర్టును ఆశ్రయించారు. అయితే తాజాగా గౌరవ హైకోర్టు నుండి వచ్చిన ఆదేశాల మేరకు కమిషనర్ పల్లి నల్లనయ్య స్పందించారు. దీంతో తక్షణమే సదరు కట్టడాన్ని తొలగించి వేయాలని కమిషనర్ ఆదేశించడంతో దుకాణ సముదాయాన్ని మొత్తం ప్రణాళిక సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నూతన నిర్మాణాలకు ప్రభుత్వం సులభతరమైన విధానాలను అవలంబి స్తోందన్నారు. అయినా గాని కొంతమంది అనుమతులు తీసుకోకుండా అక్రమ నిర్మాణాలను చేపడుతుందన్నారు. ఇటువంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పునరుద్ఘాటించారు. గుర్తింపు పొందిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ సహాయంతో నూతన నిర్మాణాలకు అనుమతులను పొందవచ్చునని తెలిపారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం వల్ల డబ్బులు వృథా అవుతుందని, అలాగే కేసులు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

శ్రీ దాడి తల్లి అమ్మవారి పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు

పోలీసు సిబ్బందికి సహకరించాలి
జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం గొల్లపల్లి శ్రీ దాడి తల్లి అమ్మవారు పండుగ నేటి నుంచి రెండు రోజులపాటు జరగనుందని ఈ జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా 300 మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గొల్లపల్లి దాడి తల్లి అమ్మవారు దర్శన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్

జిందాల్, డీఎస్పీ భవ్య రెడ్డి, పట్టణ సీఐ సతీష్ కుమార్‌తో పరిశీలించారు. ఆలయం వద్ద క్యూలైన్ ద్వారా భక్తులను పంపించడానికి ఏర్పాటు చేసిన బారికేడ్‌లను స్వయంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. దర్శనం కోసం వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ శాఖ సిబ్బందికి సహకరించాలని, పండుగ ప్రశాంత వాతావరణంలో భక్తులు జరుపుకోవాలని ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా 300 మంది సిబ్బందితో పాటు 90 సీసీ కెమెరాలు పర్యవేక్షణ ఉంటుందన్నారు. అనంతరం ఫైల్ వీధిలో అమ్మవారి సిరిమాను రథం తిరిగే ప్రాంతాలను పరిశీలన చేశారు. విలేకరులతో మాట్లాడుతూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పూర్తిస్థాయిలో సిబ్బంది నియామానికి చర్యలు చేపడతామని తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పట్టణ సీఐ సతీష్ కుమార్, గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ నారాయణరావు, ఎస్ఐలు రమేష్, నారాయణరావు ఉన్నారు.

మే 12 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: మే 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించ నున్నట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తెలిపారు. ఈ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై తమ చాంబర్లో సోమవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 8:30 నుంచి 12:00 వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం రెండున్నర నుంచి ఐదున్నర గంటల వరకు జరుగుతాయని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు తాగునీరు ఏర్పాటు చేయాలని, నిరంతర

విద్యుత్ సరఫరా ఉండాలని, పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 164 అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద, పరీక్ష పేపర్లు తరలించే సమయంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని చెప్పారు. కన్వీనర్, రీజనల్ ఇన్స్పెక్షన్ అధికారి ఎస్.తవిటి నాయుడు మాట్లాడుతూ జిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షలకు సుమారు 15000 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 6000 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతి 20 పరీక్షా కేంద్రాలకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం 52, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం 26 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణ రావు, పోలీస్, ఆర్టీసీ, పోస్టల్, రెవిన్యూ తదితరులు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోండ్రు చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - రాజాం: రాజాం మండలం కొఠారిపురంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చిత్రపటానికి గ్రామ ప్రజలు పాలాభిషేకం చేశారు. బొద్దాం నుండి లక్ష్మీపురం జంక్షన్ వరకు 80 లక్షల నిధులతో పూర్తి అయిన బీటీ రోడ్డుతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తమ గ్రామానికి విచ్చేసి బీటీ రోడ్డు వేస్తామని ఇచ్చిన మాట ప్రకారం, అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే మాట నిలబెట్టుకోవడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బట్న అసిరినాయుడు, చిట్టి భూషణ నాయుడు, పొట్నూరు సింహాచలం, వెంకట సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు మార్పులు, చేర్పులపై దృష్టిసారించండి



విశాలాంధ్ర - చీపురుపల్లి: ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా రాజకీయ పార్టీ నాయకులు అందరూ ఓటర్ల చేర్పులు మార్పులపై దృష్టి సారించాలని ఆర్డీవో బి.సత్యవాణి అన్నారు. ప్రతీ నెల మొదటి వారంలో అన్ని రాజకీయ పార్టీల సమీక్షా సమావేశం నిర్వహించవలసి ఉందన్నారు. అందులో భాగంగా నెం.15 చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గమునకు సంబంధించి చీపురుపల్లి ఓటరు నమోదు అధికారి, రెవిన్యూ డివిజినల్ అధికారి ఆధ్వర్యంలో సోమవారం చీపురుపల్లి నియోజకవర్గ స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైసీపీ ప్రతినిధి పి.మురళి, టిడిపి ప్రతినిధి గవిడి నాగరాజు, జనసేన ప్రతినిధులు వి.శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ, ఇన్‌చార్జ్ తహశీల్దారు కె.సూర్య కాంతం, రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయం పరిపాలనాధికారి ఆర్.ఈశ్వరమ్మ, ఎన్నికల తహశీల్దారు ఎం.హర్ష వర్ధిని సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర - బొబ్బిలి: స్థానిక సంస్థానం ఉన్నత పాఠశాల ఏవీ హాల్లో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. జూనియర్స్ సీనియర్స్ రెండు విభాగాల్లో నిర్వహించి విజేతలకు మొమెంటోలు అందించారు. స్థానిక మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు సౌజన్యంతో సంస్థాన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సునీత, వ్యాయామ ఉపాధ్యాయులు జలగం శ్రీనివాస్, వీడీ ప్రభాకర్ సహాయ సహకారాలతో ఈ టోర్నమెంటు నిర్వహించారు. ఈ టోర్న మెంట్లో పూర్వపు సీనియర్ క్రీడాకారులు ఆల్ ఇండియా యూనివర్సిటీలో విజయ్ సత్యనారాయణ ముప్పాల హరి, కంది శ్రీనివాసరావు, రాంబాబు , ధనుంజయ సాయి రమేష్, పద్మ, మంగళ గౌరీ వంటి క్రీడాకారులు కూడా పాల్గొన్నారు. టోర్నీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి నల్ల వెంకట్ నాయుడు, సాఫ్ట్బాల్ సెక్రటరీ విజయ్, బాల్ బ్యాడ్మింటన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఏబీసీ నాయుడు, రాజీవ్ అరుణ్ కుమార్, మురళి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు అందజేశారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కె.మౌనిక, పి.తేజస్విని కోరారు. కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె ఎనిమిదో రోజుకు చేరుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత ఎనిమిది రోజులుగా ఉద్యోగులంతా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. 6 సంవత్సరాలుగా ఒక్క రూపాయి వేతనం పెరగలేదన్నారు. ప్రజారోగ్య వ్యవస్థలో పనిచేస్తున్న మన అందరం ఒక కుటుంబం లాగా మెలుగుతూ ఎవరు కూడా ఏ ఒక్క కేడర్ నీ అవమానించేలా, కించపరిచేలా వ్యాఖ్యలు చేయకుండా, గౌరవంగా అవగాహనతో పనిచేస్తూ వ్యవస్థను బలోపేతం



చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వి.కనకదుర్గ, ప్రమీల, విజయలక్ష్మి పాల్గొన్నారు. సమ్మెకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బలివాడ బాల భాస్కరరావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు బాలాజీ పాణిగ్రహి, లంక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మినుము పంటకు మద్దతు ధర ఇవ్వాలి

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: జిల్లాలో మినుము పంట కొనుగోలుకు కేంద్రాలు పెట్టి సుమారు 2 నెలలు అయినా జిల్లాలో నిబంధనల మేరకు లేవని మార్క్ ఫెడ్ డీఎం సాకు చూపుతూ రైతులు నుంచి ఇంతవరకు సేకరణ చేయకపోవడం వల్ల రైతులు నష్ట పోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు అన్నారు. మార్క్ ఫెడ్ నిర్ణయం వల్ల వ్యాపారులు మరింత ధర తగ్గించారని అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు అనంతరం కలెక్టరేట్లో ఉన్నత అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత 8 ఏళ్లలో ఈ జిల్లా లో మద్దతు ధర కన్నా తక్కువగా మార్కెట్‌లో ఉన్నపుడు 3 సార్లు మార్క్

ఫెడ్ ద్వారా కొనుగోలు చేశారని, ఇదే రకం అనాదిగా ఈ జిల్లాలో పండిస్తున్నారని అన్నారు. వ్యాపారులు ధర తక్కువకు కొని అనేక సందర్భాలలో మద్దతు ధర కన్నా ఎక్కువకు అమ్ముకొని కోట్లు రూపాయలు లాభాలు పొందుతున్నారని, మార్క్ ఫెడ్ డీఎం మాత్రం నిబంధనలు సరిపోలేదని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పుడు మినుములు మద్దతు ధర కన్నా సుమారు రూ.2,000 తక్కువకు మార్కెట్‌లో 5,800 అడుగుతున్నారని, ఇప్పటికే తక్కువకు అమ్ముకొని జిల్లాలో లక్షలాది రూపాయలు రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ కె.నారాయణరావు, సిరికి శ్రీరాం మూర్తి, లోకవరపు ఆదినారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొఠియా గిరిజనుల సమస్య పరిష్కరించాలి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌కి పౌర వేదిక బృందం వినతి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు గ్రామాలైన వివాదాస్పద కొఠియా గ్రామాల గిరిజనులను ఒడిశా అధికారులు, పోలీసులు ఇబ్బందులు పెడుతున్న తీరుపై ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల గవర్నర్లతోను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనూ మాట్లాడి గిరిజనుల సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకర్రావుని విజయనగరం జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, వారి బృందం సభ్యులు కోరారు. సోమవారం జిల్లా పరిషత్ అతిథిగృహంలో చైర్మన్‌తో సమావేశమై కొఠియా వివాదాస్పద గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ అధికారులు గిరిజనులను వారి సమస్యలను పట్టించుకోకుండా ఉండటంతో ఒడిశా ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అమాయక గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఒక్కో గ్రామంలో తిష్టవేసిందని రెండు రాష్ట్రాల మధ్య సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన స్టేటస్కో ఉండగా ఒడిశా ప్రభుత్వం ఎలా ఆంధ్రప్రదేశ్ గిరిజన గ్రామాల్లోకి చొచ్చుకు వస్తుందని భీశెట్టి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికారులని, రెవెన్యూ సిబ్బందిని, అంగన్వాడీ సిబ్బందిని చివరకు అత్యవసర సేవలైన అంబులెన్స్‌లను కూడా కొఠియా వివాదాస్పద గ్రామాల్లోకి ఒడిశా పోలీసులు రాకుండా అడ్డుకుంటున్నారని కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకు

వచ్చారు. గడచిన 55 సంవత్సరాలుగా రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో 21 గ్రామాల్లో 6 పంచాయతీల్లో వివాదం ఉందని అన్నారు. 1968లో వివాదం ప్రారంభమైతే 1988లో సుప్రీంకోర్టు స్టే విధించి, 2006లో స్టేటస్కో ఇచ్చిందని, ఒడిశా ప్రభుత్వం దూకుడుగా వ్యవవహరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లోని ఘనులు భూగర్భజలాలను కొట్టేయడానికి తగిన ప్రణాళికలు తయారు చేసిందని ఆయన అన్నారు. గిరిజనులకు అండగా ఉండటంలో మన్యం జిల్లా కలెక్టర్, ఎస్పీ,గిరిజన సంక్షేమ శాఖ అధికారులు విఫలం అయ్యారని భీశెట్టి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పౌర వేదిక ప్రతినిధులు పిడకల ప్రభాకరరావు, తాడేపల్లి నాగేశ్వరరావు, తుమ్మగంటి రామ్మోహన్‌రావు, తాత్రాజు రాజారావు, మమ్ముల తిరుపతిరావు, ఇప్పలవలస గోపాలరావు, ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్, ఎలక్ట్రికల్ కోర్సులకు దరఖాస్తులు

విశాలాంధ్ర - రాజాం: రాజాం ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన నైపుణ్య కేంద్రంలో వెబ్ డెవలపర్ కంప్యూటర్ కోర్స్, సోలార్ పీవీ ఇన్స్టాలర్ ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు తెలిపారు. ఈ ఉచిత శిక్షణకు పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్ కార్డు, 10 వ తరగతి సర్టిఫికెట్ జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు తేదీ. 10-05-2025 లోపు రాజాం ప్రభుత్వ ఐటిఐను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7286042743, 8121450657 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ బి.భాస్కరరావు తెలిపారు.

గిరిజన విద్యార్థులకే అధికంగా సీట్లు కేటాయించాలి

- కోర్సులపై గిరిజన యువతలో అవగాహన కల్పించాలి
- రాష్ట్ర ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ డా.డివిజి శంకరరావు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో అందుబాటులో వున్న వివిధ కోర్సుల్లో గిరిజన విద్యార్థులకే అధికంగా విద్యావకాశాలు కల్పించాల్సి వుందని రాష్ట్ర షెడ్యూల్డు తెగల కమిషన్ ఛైర్మన్ డా.డి.వి.జి.శంకరరావు అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సంబంధిత చట్టంలో మార్పులు తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఎస్.టి.కమిషన్ తరపున గిరిజన విద్యార్థులకు మరింత అధికంగా సీట్లు కేటాయింపు జరిగేలా కేంద్రానికి ఒక లేఖ రాస్తామన్నారు. దీనితోపాటు ఇందులో నిర్వహిస్తున్న వివిధ కోర్సుల్లో ఈ ప్రాంత గిరిజన విద్యార్థులు అధికంగా చేరేలా అవగాహన కల్పించాల్సి వుందన్నారు. దీనికోసం విశ్వవిద్యాలయం అందిస్తున్న పలు కోర్సులపై గిరిజన ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. గిరిజన విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బంది అవసరమైన సంఖ్యలో లేనందున అధ్యాపకులు, బోధన సిబ్బందిపై అధికభారం వుంటోందని గమనించామని, దీనిని నివారించేందుకు విశ్వవిద్యాలయ అవసరాలకు తగినట్టుగా అధ్యాపకులు, బోధన సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాల్సి వుందని కేంద్రానికి నివేదించనున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ డా.డి.వి.జి.శంకరరావు సోమవారం నగరంలోని గాజులరేగ ప్రాంతంలో వున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. వైస్ ఛాన్సలర్ ప్రొ.టి.వి.కట్టమణి, ఇతర అధికారులు, అధ్యాపకులతో భేటీ అయి విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కోర్సులు, గిరిజన విద్యార్థులకు కల్పిస్తున్న విద్యావకాశాలు, యీ ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధిలో యూనివర్శిటీ నిర్వహిస్తున్న పాత్రపై చర్చించారు. గిరిజన విశ్వవిద్యాలయం నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం కుంటినవలస వద్ద గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణం జరుగుతున్న శాశ్వత స్థాయి క్యాంపస్ నిర్మాణ పనులను పరిశీలించారు. విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఎస్.టి.కమిషన్ ఛైర్మన్‌కు వి.సి. ప్రొ.కట్టిమణి తదితరులు సాదర స్వాగతం పలికి, విశ్వవిద్యాలయంలో కల్పిస్తున్న విద్యావకాశాలు, తరగతుల నిర్వహణపై ఛైర్మన్‌కు వివరించారు. ప్రస్తుతం వున్న వైస్ ఛాన్సలర్ ప్రొ.కట్టిమణి నేతృత్వంలో అధ్యాపకులు, సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేస్తూ

యీ విశ్వవిద్యాలయ అభివృద్ధికోసం తపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంత గిరిజనులకు ఎదురయ్యే సికిల్ సెల్ ఎనిమియా, ఇతర ఆరోగ్య సమస్యలపై వారిలోఅవగాహన కల్పించి వాటి నుంచి రక్షణ కల్పించే దిశగా యూనివర్శిటీ చొరవ చూపాలని ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ కోరారు. అనంతరం మెంటాడ మండలం కుంటినవలస వద్ద గిరిజన విశ్వవిద్యాలయం శాశ్వత క్యాంపస్ నిర్మాణం పనులను ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ పరిశీలించారు. పనుల పరిశీలనలో ఆర్.డి.ఓ. రామ్మోహనరావు, యూనివర్శిటీ ఏ.ఓ. సూర్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జెడ్పీ అతిథిగృహంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, విజయనగరం ఆర్.డి.ఓ. కీర్తి తదితరులు ఎస్.టి.కమిషన్ ఛైర్మన్‌ను కలసి గిరిజన విశ్వవిద్యాలయంలో వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న చర్యలను వివరించారు.

వినతులను సంతృప్తి చెందేలా పరిష్కరించాలి

- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. ప్రధానంగా ఆడిట్ టీం రిమార్కు లలో సంతృప్తి చెందినట్లు రాయాలని తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ పెండింగ్ వినతులు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ కు 177 వినతులు అందాయి. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సేతు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, ఆర్.డి.ఓ కీర్తి డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 177 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 87 వినతులు అందాయి. పంచాయతీశాఖకు 15, పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 17 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 06 , విద్యా శాఖకు 9, హౌసింగ్ కు 3 అందగా, వైద్య శాఖకు

05, విద్యుత్ శాఖకు 6 చొప్పున అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి. రెండు రోజుల పాటు జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మున్సిపల్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు 50 కోట్లు, ఆ పైబడి నిధులతో మంజూరైన ప్రోజెక్టుల వివరాలను నిర్దిష్ట ప్రొఫార్మలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వారికి వెంటనే అందజేయాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ వివరాలను ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ పోర్టల్ నందు అప్లోడ్ చేయవలసి ఉందని తెలిపారు.

విద్యార్థులను అభినందించిన ఇన్‌ఛార్జి కలెక్టర్

విశాలాంధ్ర - విజయనగరం: పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన మెరకముడిదాం మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ సోమవారం తమ ఛాంబర్లో అభినందించారు. వారు మరింతగా రాణించి మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పదోతరగతిలో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను విమాన ప్రయాణం చేయిస్తానని ఇచ్చిన మాట ప్రకారం, గోపన్నవలస జెడ్‌పి ఉన్నతపాఠశాల తెలుగు ఉపాధ్యాయులు

మరడాన సత్యారావు తమ మాట నిలబెట్టుకున్నారు. ఈ మేరకు జిల్లాలోనే మొదటి స్థానం సాధించిన గర్భాం జెడ్‌పి పాఠశాల విద్యార్థి సంగారెడ్డి వివేక్ (593), తృతీయ స్థానం సాధించిన బైరిపురం జెడ్‌పి ఉన్నతపాఠశాల విద్యార్థి తాడేల రేవంత్ (591) తదితరులను విమాన ప్రయాణం చేయించి, ఇన్‌ఛార్జి కలెక్టర్ వద్దకు తీసుకువచ్చారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇన్‌ఛార్జి కలెక్టర్ అభినందించి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఈఓ గౌరీశంకరరావు, ఉప విద్యాశాఖాధికారి కెవి రమణ, ఎపిసి డాక్టర్ రామారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ టి.సన్యాసిరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, మరడాన ఈశ్వర్రావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

కుల గణన పట్ల కేంద్ర నిర్ణయంపై హర్షం

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: దేశంలో జన గణన చేసి కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని ఆంధ్రప్రదేశ్ రెల్లి కుల ఉప కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సోము మురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టరేట్లో గ్రీవెన్స్‌లో

వినతిపత్రం అందజేశారు. దేశంలో, రాష్ట్రంలో రెల్లి ఇతర కులాల చాలా వెనకబడి ఉన్నారని, అయితే కేవలం ఎస్సీల్లో ఒక వర్గం మనుషులకే అన్ని అవకాశాలు కల్పిస్తూ రాజ్యాంగం రాశారని, దానివల్ల అదే ఎస్సీ సామాజిక వర్గంలో పుట్టిన రెల్లి, ఇతర 13 ఉప కులాల వారికి అన్యాయం జరుగుతుందన్నారు. రాజ్యాంగం రాసేటప్పుడు అప్పటి కమిషన్ ఇచ్చిన తప్పుడు లెక్కలు వల్ల దశాబ్దాలుగా అన్యాయం జరుగుతుందన్నారు. జనాభా ప్రాతిపదికన చూస్తే జనాభా తక్కువగా ఉన్నారని ఎటువంటి హక్కులు, రిజర్వేషన్ కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం జన కుల గణన ఆధారంగా వర్గీకరణ ఫలాలు అందరికీ అందేలా చూస్తారని వేడుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం నియోజకవర్గ రెల్లి కుల అధ్యక్షులు రామారావు, దశమంతుల శ్రీను, తుపాకుల ఈశ్వరరావు, పి.రవి, ఎస్.వెంకయ్య, కృష్ణ, నారాయణ, జి.మహంకాళి, టి.నరేంద్ర, బలరాం, ఎస్.వాసుదేవరావు, జి.పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికల తొలగింపు

విశాలాంధ్ర - విజయనగరం: కాలువల్లో పేరుకుపోయిన పూడికలను విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది తొలగించి వేస్తున్నారు. ప్రధాన కాలువలతో పాటు చిన్న చిన్న కాలువల్లో కూడా మట్టి చెత్తాచెదారాలు పూడికపోవడంతో నీరు నిల్వ ఉండిపోతుంది. దీనిని గమనించిన కమిషనర్ తక్షణమే ప్రత్యేక పనివారలతో కాలువల ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో అనేక ప్రాంతాలలో కాలువల పరిశుభ్రత కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ కాలువల్లో చెత్తాచెదారాలు పూడిక చేరిపోవడంతో మురికినీరు ప్రవాహానికి అడ్డంకిగా మారుతుందన్నారు. దీనిని గమనించిన తాము ఎప్పటికప్పుడు ప్రక్షాళన దిశగా ఆదేశాలిస్తున్నామన్నారు. అలాగే అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలు వల్ల కాలువల పూడిక చేరితే నీరు నిలిచిపోయే అవకాశం ఉందని దీనివల్ల వర్షపు నీరు రహదారులపై ప్రవహించి ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. అలాగే ప్రజలు కూడా కాలువల్లో చెత్తాచెదారాలు వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పశువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి: ఆర్డీఓ

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతుందని పశువుల అక్రమ రవాణాపై అధికారులు నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని చీపురుపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.సత్య వాణి అన్నారు. సోమవారం చీపురుపల్లి ఆర్.డి.ఓ కార్యాలయంలో జరిగిన డివిజనల్ జంతు సంక్షేమ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జంతువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. రాజాం అచ్యుతాపురం సంతల్లో పశువులను హింసాత్మకంగా, అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పశువులు అక్రమ రవాణాకు కేంద్రంగా మారుతున్న సంత సంత స్థలాలకు, సంతల నిర్వహణకు లైసెన్స్ లేకపోయిన అక్రమంగా సంత నిర్వహిస్తున్నారని ఆమె అన్నారు. అక్రమ సంతల నిర్వహణపై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. దేవాలయాలకు మూడు వందల మీటర్ల వరకు ఎటువంటి జంతుబలులు జరగకుండా చూడాలని దేవాలయాల వద్ద జంతు బలులు జరగకుండా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య వారు రూపొందించిన గోమాత చిత్ర పటంతో కూడిన క్యాలండర్లను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. చీపురుపల్లి డివిజనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.రాఘవులు మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు

"జీవబంధు" లోగిశ రామకృష్ణ, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ దామోదర్ రావు, రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పల నాయుడు, చీపురుపల్లి సర్కిల్ ఇన్ స్పెక్టర్ శంకర్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శారద, గుర్ల అసిస్టెంట్ డైరెక్టర్ రమణాచలం, గుర్ల మండల పంచాయతీ విస్తరణ అధికారి కె.ఎస్.ఎస్ అన్నపూర్ణ దేవి, రాజం పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. జయప్రకాష్, ఆర్.డి.ఓ. కార్యాలయం పరిపాలన అధికారి ఆర్.ఈశ్వరమ్మ, పశు వైద్యులు సి.హెచ్. వి.బాను పూర్ణిమ, సి.హెచ్.హైమావతి, అచ్యుతాపురం పంచాయతీ సెక్రటరీ బి.ఆదినారాయణ, గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.ఆర్.సత్యనారాయణ, జీవ రక్ష సంఘం రాష్ట్ర కార్యదర్శి వుజూరు ఝాన్సీ, జిల్లా కమిటీ సభ్యులు వేమలి యమున, కేత జీవన తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఈసీఎస్‌లో అవినీతిపై విచారణ చేయాలి

జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటల అప్పారావు

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి ఆర్ఇసిఎస్ పరిధిలో అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులను కూటమి పాలకులు ఎందుకు అడ్డుకోవడం లేదని జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంట అప్పారావు ప్రశ్నించారు. చీపురుపల్లి ఆర్ఇసిఎస్ ఎండి అవినీతిపైన ఐఏఎస్‌తో విచారణ జరిపించాలన్నారు. ఆర్ఈసిఎస్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాల పైన కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని, నామినేటెడ్‌గా చైర్మన్ పదవిని నియమిస్తున్న నేపథ్యంలో అధికారిక అక్రమార్కులపైన కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన కోరారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఆర్ఇసిఎస్‌కి పట్టిన గ్రహణంలా ఉన్న పిల్లి రమేష్‌ని ఎందుకు తొలగించట్లేదని ఆయన ప్రశ్నించారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆర్ఇసిఎస్ లో ఎనర్జీ అసిస్టెంట్లు నియామకం కు 116 సి ప్రకారం రిజిస్టర్ వారి ఆమోదం లేకుండా జరిగాయని అన్నారు. ముఖ్యంగా నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇచ్చి ఉన్నారని అనేకమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం 6గురి అభ్యర్థులకు మాత్రమే నోటీసులు ఇచ్చినట్లు పత్రిక ముఖంగా తెలియజేసిన యండి మిగతా నకిలీ వారికి నోటీసులు ఎందుకు ఇవ్వలేదన్నారు. ఇదంతా బట్టబయలు కావాలంటే ఏపీ ఈపీడీసీఎల్ విజిలెన్స్ వారి నివేదిక బయటకు రావాలి అన్నారు. ఆ నివేదిక బయటపడితే ఆధారాలతో ఆర్ ఇ సి ఎస్ అక్రమాలు బయటపడతాయన్నారు.

నేటి నుంచి మినుము పంటను కొనుగోలు చేస్తాం

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్,: జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మినుము లు బస్తాలు, పోగు పోసి కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న రైతుల వద్దకు అధికార యంత్రాంగం వెళ్ళింది. నిరసన కార్యక్రమం వద్దకు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, మార్క్ ఫెడ్ డి ఏం లు వచ్చి మంగళవారం నుంచి కొనుగోలు చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఇందులోఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు, రైతు సంఘం జిల్లా ఉప అధ్యక్షులు లోకావరపు ఆదినారాయణ మూర్తి, కౌలు రైతులు సంఘం నాయకులు కని రెడ్డి నారాయణ రావు, వినినిగిరి సర్పంచ్, ఉప సర్పంచ్, రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీరామ్మూర్తి, సిరికి వెంకట సత్య నారాయణ, సీర కృష్ణ, పాల రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొంపా కృష్ణ మూర్తి, వ్యవసాయ కార్మికులు సంఘం జిల్లా కార్యదర్శి గాడు అప్పారావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో డివైడర్లు, స్పీడ్ బ్రేకర్లపై ప్రమాదాలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట పట్టణ కేంద్రంలో విశాఖపట్నం-అర్థదారి రోడ్డుపై డివైడర్లు ఉన్న ప్రాంతాలలో సరైన వాహన నియంత్రణ లేకపోవడం వల్ల, వాహనదారులు డివైడర్ల మీదకు ఎక్కి ప్రమాదాలు సృష్టిస్తున్నారు. ఈ పరిస్థితి ప్రాంతంలో ట్రాఫిక్ అస్తవ్యస్తతకు దారితీస్తుంది. అలాగే, స్థానిక సబార్డినేట్ న్యాయస్థానం సమీపంలో ఇటీవల ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు సూచిక బోర్డులు లేకపోవడం వల్ల, అనేక వాహనచోదకులు వేగాన్ని తగ్గించకుండా ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కొన్ని యాక్సిడెంట్లు కూడా సంభవించాయని ప్రాంత ప్రజలు తెలియజేశారు. ఈ పరిస్థితిపై రోడ్డు రవాణా శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని, డివైడర్ల చుట్టూ సురక్షా ఏర్పాట్లు మరియు స్పీడ్ బ్రేకర్ల సమీపంలో స్పష్టమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రత కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



రాజకీయ దురుద్దేశంతోనే కొండ గెడ్డ వెడల్పు

విశాలాంధ్ర - విజయనగరం, కంటోన్మెంట్: తాము నివాసం ఉంటున్న ఇళ్ల వెనక ఉన్న కొండ గెడ్డ కాలువను ఉద్దేశ పూర్వకంగానే అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు గెడ్డను వెడల్పు చేస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో నీటి ప్రవాహం పెరిగి ఇళ్లకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఎస్.కోట ప్రాంతానికి చెందిన పలువురు బాధితులు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తొలుత కలెక్టరేట్ గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్‌లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఏం.రమణ మాట్లాడుతూ ఎస్.సి, ఎస్.టి, బి.సి నిరుపేదలకు చెందిన వాళ్లు చాలా ఏళ్లుగా కొండ గెడ్డకు ఆనుకొని నివాసం ఉంటున్నారని, వారిని ఇబ్బందుల్లోకి నెట్టేసేలా గెడ్డను వెడల్పు చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, అటువంటి వారి మీద రాజకీయ కక్ష సాధింపులు సరికాదన్నారు. తక్షణమే ఆ గెడ్డ వల్ల ఆ కుటుంబాలకు ఇబ్బంది లేకుండా ఆ ఇళ్లకు ఆనుకొని పెద్ద ఎత్తున గోడను నిర్మించాలని డిమాండ్ చేశారు.

పీజీఆర్ఎస్‌కు 2 వినతులు

విశాలాంధ్ర - విజయనగరం: నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి రెండు వినతులు వచ్చాయి. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజా వినతులను స్వీకరించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే వినతులను ఎప్పటి కప్పుడు పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా మన్నారు. సోమవారం వచ్చిన రెండు వినతులను టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందినవని వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించామన్నారు. తాగు నీటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులకు అప్రమత్తం చేస్తూ నీటి పంపిణీ చేపడుతున్నామన్నారు. ఆంధ్ర జలాశయం నుంచి ఇప్పటికే నెల్లిమర్ల వాటర్ వర్క్స్ వద్దకు నీరు చేరిందని కావున వేసవిలో నీటి ఇబ్బందులు ఉండక పోవచ్చని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ టి.రాయల్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రమణమూర్తి, మేనేజర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

కన్నం గడ్డ సమస్యకు సమస్యకు శాశ్వత పరిష్కారం

30 లక్షల రూపాయలతో కల్వర్టు పనులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోట మండల కేంద్రంలోని వన్-వే ట్రాఫిక్ జంక్షన్ వద్ద ఉన్న కన్నం గడ్డ సమస్య చాలా కాలంగా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో వర్షాలు కురిసినప్పుడల్లా రోడ్డుపై నీరు పొంగి, రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. ఇది ఇంతకు ముందు అనేకసార్లు మరమ్మతు చేయబడినప్పటికీ, సమస్య మళ్లీ మళ్లీ తలెత్తుతూ ఉండడంతో స్థానికులు బాధ పడుతున్నారు. ఈ పరిస్థితిని తీవ్రంగా గమనించిన లిలికూటమి ప్రభుత్వం, ప్రాంతవాసుల సౌకర్యం కోసం 30 లక్షల రూపాయల బడ్జెట్ కేటాయించి, ఇక్కడ కల్వర్టు నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రాంతవాసులు మాట్లాడుతూ, ఈ సమస్య చాలా సంవత్సరాలుగా మాకు ఇబ్బంది కలిగిస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చాలా స్వాగతార్హమైనది. కల్వర్టు నిర్మాణం పూర్తయ్యాక రోడ్డు మీద నీటి కుండ్లు, ప్రమాదాలు తగ్గి, రాకపోకలు సుగమం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపిటీఎఫ్) మండల రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతిలో మోడల్ ప్రాథమిక పాఠశాల, బేసిక్ ప్రాథమిక పాఠశాలలనే కొనసాగించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో రెండు ఎస్జీటీ పోస్టులు ఉండే విధంగా చూడాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, పిడి పోస్టులు మంజూరు చేయాలని, 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండవ సెక్షన్ ఇవ్వాలన్నారు. మాతృభాష మాధ్యమాన్ని విద్యాహక్కు చట్టంలో పేర్కొన్న విధంగా కొనసాగించాలని, సిపిఎస్, జిపిఎస్ రద్దు చేయాలన్నారు. మెమో నెంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి వెంటనే ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు, రాష్ట్ర కౌన్సిల్ కర్రి రవి, పి.వి.ప్రసాద్, మజ్జి రమేష్, గురుమూర్తి, తిరుమలరెడ్డి శ్రీనివాసరావు, సిహెచ్ కోటేశ్వరరావు, మత్రాపు శ్రీనివాసరావు, కె.శ్రీనివాసన్, సంపూర్ణ లత కృష్ణమూర్తి, పి.లత తదితరులు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్‌లో రక్షణ-ఆధారిత మానసిక ఆప్టిట్యూడ్ అసెస్మెంట్‌పై శిక్షణ

విశాలాంధ్ర - డెంకాడ: ఎం.వీ.జీ.ఆర్ కళాశాల రక్షణ-ఆధారిత నాయకత్వ శిక్షణ కోసం మానసిక ఆప్టిట్యూడ్ అసెస్మెంట్పై 5-రోజుల ఫ్యాకల్టీ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ శిక్షణ మే 9న ముగుస్తుంది. ప్రారంభ కార్యక్రమానికి ఇండియన్ కోస్ట్ గార్డ్ ఇన్స్పెక్టర్ జనరల్ దేవానంద్ జి పిళ్ళై (రిటైర్డ్), ఇండియన్ నేవీ కమోడోర్ మనోజ్ భురారియా (రిటైర్డ్) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎం.వీ.జీ.ఆర్ ప్రిన్సిపాల్ డా. ఆర్.రమేష్ మాట్లాడుతూ నిర్మాణాత్మక రక్షణ-ఆధారిత వ్యక్తిత్వ మూల్యాంకనం, నాయకత్వ అభివృద్ధితో విద్యా మార్గదర్శకత్వాన్ని సమలేఖనం చేయడం యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. విద్యార్థులలో నాయకత్వ సామర్థ్యాన్ని గుర్తించి, మార్గనిర్దేశం చేయడానికి అధ్యాపకులను సన్నద్ధం చేయడానికి ఉద్దేశించిన మానసిక పరీక్షా పద్ధతులు (టాటా వెట్ ఎస్ ఆర్ టి ఎస్ డి టి), గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కు (జి టి ఓ), ప్రవర్తనా ఇంటర్వ్యూలు, నిర్మాణాత్మక అంచనా పద్ధతులపై ఆయన వివరించారు. ఈ ప్రారంభ సమావేశంలో వైస్-ప్రిన్సిపాల్ డా. వై.ఎం.సి శేఖర్, అన్ని డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోమ్స్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - విజయనగరం, కంటోన్మెంట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఉత్తర్వులు మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.భబిత ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్ విజయనగరంలో ఉన్న కొన్ని చిల్డ్రన్స్ హోమ్స్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేసారు. కేఎల్ పురంలో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న శిశు గృహం, మిరియం బాల, బాలికల చిల్డ్రన్ హోమ్, నవజీవన్ చిల్డ్రన్ హోమ్, లవింగ్ షెఫర్డ్ చిల్డ్రన్ హోమ్, రెయిన్బో బాల బాలికల చిల్డ్రన్ హోమ్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రెయిన్బో చిల్డ్రన్ హోమ్ బాలికల హోమ్‌లో ముగ్గురు బీహార్ నుంచి తప్పిపోయి వచ్చిన బాలికలుగా గుర్తించారు. వారు గత నాలుగు సంవత్సరములుగా వసతి గృహంలో ఉంటున్నారు. బాలికల తల్లిదండ్రుల పేర్లు తప్ప మరే వివరములు చెప్పలేకపోతున్నారు. వారి యొక్క వివరాలు సేకరించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్పించే ఏర్పాట్లు చేస్తామని గృహ నిర్వాహకులకు తెలియజేశారు. చిల్డ్రన్ హోమ్స్ యొక్క రిజిస్టర్లను రికార్డులను పరిశీలించారు. విద్యకు సంబంధించి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు.